# పెళ్ళంటే!

**—యా**

''ఆ గిరిపల్లి శోభనాచలవాసా! శ్రీ లక్ష్మీనృశింహా మాం పాహీ! మాం పాహీ! సఖ లాభిష్ట ప్రదాతా! శ్రీలక్ష్మీ నృశింహా మాంపాహీ! మాంపాహీమాం'' అని మనస్సులో స్మరించుకుని శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని తృప్తిగా వీక్షించి పూజారిగారు చూపిన హారతి కనులకు అద్దుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆలయం నుంచి బయటకి వచ్చి అక్కడ మండపంపై కూర్చుని ఆలయంకి వచ్చే భక్త జనాలను చూస్తున్నారు విశ్వరూపాచార్యులుగారు.

''విశ్వరూపాచార్యులుగారూ! మీకు ఉత్తరం'' అంటూ పోస్టుమాన్ కార్డునందించారు నవ్వుతూ.

''కొండ ఎక్కి నా కోసం వచ్చావా? ఇంటి దగ్గర ఇవ్వలే కపోయావా?'' అన్నారు విశ్వరూపాచార్యులుగారు నొచ్చుకుంటూ.

''ప్రతి శనివారం శ్రీ స్వామిని దర్శించుకున్నాకే బట్వాడా ఇస్తాను. స్వామిని చూచి బయటకు వస్తే మీరు కనిపించారు'' అని చెప్పి సెలవు తీసుకుని మెట్లవైపు వెళ్లిపోయాడు పోస్టుమాన్.

విశ్వరూపాచార్యులుగారు ఉత్తరం చూచారు.

''విశ్వరూపాచార్యులుగారికి,

మీ మేనకోడలు పెళ్లిచూపులు చూడడానికి పందొమ్మిదో తారీఖున నిజామాబాద్ వస్తున్నాము. మీరు అక్కడికి వస్తే అన్ని విషయాలు మాట్లాడుకుని శుభం అనుకుందాం.

పార్వతీశం, మచిలీపట్నం''

ఉత్తరం చూసిన విశ్వరూపాచార్యులుగారు ఆలోచనలో పడ్డారు. ఆయన చెల్లెలు సావిత్రమ్మ, ఆమె భర్త నీలకంఠం. నిజామాబాద్‌లో ఉన్న ఆ దంపతులకు కాత్యాయని, కామాక్షి సంతానం. ఎదిగిన ఆడపిల్లలకు పెళ్లి చేయడం ఈ రోజుల్లో ఎన్నికలలో గెలవడంకన్నా కష్టమౌతోంది.

నీలకంఠం దూరపు బంధువు దుర్గాంబ ద్వారా కాత్యాయనికి సంబంధం వచ్చింది.

''అబ్బాయి అందంగానే వుంటాడు. మందుల కంపెనీలో ఉద్యోగం. ఆదాయం బాగానే ఉంటుంది'' అని చెప్పింది దుర్గాంబ.

దుర్గాంబ మాటంటే నీలకంఠానికి వేదవాక్కు. మాట్లాడకుండా ఎవ్వరినీ సంప్రదించకుండా దుర్గాంబ చూపిన మదన్‌కి కాత్యాయనిని ఇచ్చి పెళ్లి చేసేశాడు.

పెళ్లయిన తరువాత మదన్ వాళ్ల ఊరు నందిగామ వెళ్లి చూస్తే మదన్ చేసేది మందుల కంపెనీలో ఉద్యోగం కాదు. బార్‌లో సప్లయర్. బార్‌కి వచ్చినవాళ్లు టిప్‌గా ఇచ్చే రాబడి, జీతంపై ఎక్కువ రాబడి. అదే పెద్ద ఉద్యోగంలా ఫోజులు ఇస్తూ.

''మావారి దగ్గరకు పెద్ద పెద్ద ఆఫీసర్లు, కోటీశ్వరులు వస్తారు. నేను కో అంటే కొండమీద కోతిని తేగలరు. మా ఖర్చుకి ఎవ్వరూ పోటీపడలేరు'' అని గొప్పలు చాటుకుంది.

అక్కయ్య ఆర్భాటం కామాక్షికి నచ్చదు. బావగారి వెకిలిచేష్టలకి చిరాకుపడేది.

''ఇదిగో కామాక్షీ! నాకు వచ్చే సంపాదనతో కాంభోజ రాజులా ఏడుగురు భార్యలను చేసుకోవచ్చు. నా గ్లామర్‌కి మా నందిగామ మొత్తం కన్నెపిల్లలు విరగబడి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఆ బ్రహ్మ మీ అక్కకి నాకు ముడి వేశాడు. ఎండిపోయిన బెండకాయలాంటి మీ అక్కకి యాపిల్‌పండులాంటి నాకు జోడి ఏమిటి? ఇంకా నీ పర్సనాలిటీకి నాకు బాగుంటుంది'' అంటుంటాడు మదన్ కోణంగిలా పల్టీలు చేస్తూ ఇకిలిస్తూ.

''బావగారూ! ఎంతవరకో అంతవరకే వుండండి. హద్దు మీరితే అక్క మొగుడని కూడా చూడకుండా చెప్పుతో కొడతాను'' అంది కామాక్షి రౌద్రంగా.

''అదేంటే బావ సరసానికి అంటే అంత మాట అనవచ్చా?'' మందలించింది సావిత్రమ్మ అల్లుడు అలుగుతాడేమోననే భయంతో.

ఒకసారి మాట మీద మాట వచ్చి అలిగి రెండురోజులు కాత్యాయనిని చితకతన్ని అందరికీ అనేక రకాల భాషల్లో బూతులు తిట్టి వీధిలోకి వెళ్లి వచ్చిపోయే వారికి ఇంటిగుట్టు విప్పిచెప్పి అల్లరి చేశాడు. అందుకే సావిత్రమ్మకి అల్లుడ్ని చూస్తే వణుకు.

ఇటువంటి అల్లుడు విషనాగులకు కూడా వద్దు అనుకుని విశ్వరూపాచార్యులుగారికి చెప్పి ''నీకు తెలిసిన దగ్గర మంచి సంబంధం కామాక్షికి చూడు అన్నయ్యా'' అంది.

మచిలీపట్నంలో పార్వతీశంగారి అబ్బాయి ఉన్నాడని తెలిసి దానికై తీవ్ర ప్రయత్నం చేశాడు విశ్వరూపాచార్యులు.

★★★

పందొమ్మిదో తారీకు సాయంత్రం నాలుగుగంటలకు పెళ్లిచూపులు ఏర్పాటు చేయమని నీలకంఠానికి ఫోన్ చేసి చెప్పారు.

ఆ రోజు నిజామాబాద్ బయలుదేరిన బస్సు రిపేరు రావడంతో మధ్యలో ఒక పూట ఆలస్యం అయి రాత్రి తొమ్మిదిగంటలకు సావిత్రమ్మ ఇంటికి చేరారు విశ్వరూపాచార్యులు.

''పెళ్లికొడుకు వాళ్లు వచ్చారా?'' ప్రశ్నించాడు విశ్వరూపాచార్యులు.

''ఆ వచ్చారు. వాళ్లకి ఏం సంస్కారం తెలియదు. పెళ్లి చూపులకి వచ్చేవాళ్లు పువ్వులు, పండ్లు తెస్తారుకదా. వీళ్లు లింగులింగుమంటూ చేతులు కట్టుకుంటూ వచ్చి పెట్టిన ఫలహారాలు మెక్కి వెళ్లారు'' అన్నాడు మదన్.

''వాళ్లకి చదువుంటే సంస్కారం వుంటుంది. ఏదో కట్టు నగల కంపెనీలో చిన్న గుమస్తాగాడికి ఏం సంస్కారం తెలుస్తుంది. అడవిమూక'' అంది కాత్యాయని మూతి తిప్పుకుంటూ.

టెన్త్ మూడుసార్లు పల్టీ కొట్టి పాస్ అయిన సంగతి ఎవరికీ తెలీదు అనుకుని డిగ్రీ చదివినట్లు వీర ఫోజులిస్తుంది.

విశ్వరూపాచార్యులుగారు ఇవేమీ పట్టించుకోకుండా ''బావగారూ! అసలు జరిగింది చెప్పండి'' అన్నారు.

★★★

ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు మచిలీపట్నం నుంచి పార్వతీశం, ఆయన భార్య జగదీశ్వరి, పెళ్లికొడుకు మల్లిబాబు, ఇంకా ఇద్దరు ఆడవాళ్లు వచ్చారు.

సావిత్రమ్మ, నీలకంఠం వాళ్లను ఆహ్వానించి ఎంతో మర్యాద చేశారు.

''విశ్వరూపాచార్యులుగారు రాలేదామ్మా?'' అడిగాడు పార్వతీశం.

''రాలేదండీ. మీరు వస్తున్నట్టు ఫోన్‌ద్వారా తెలియజేశారు. తప్పక రావాలి. ఎందుకు రాలేదు అని మేము ఎదురు చూస్తున్నాం'' అంది సావిత్రమ్మ బిడియపడుతూ.

పార్వతీశం ఎంతో స్వతంత్రంగా మాట్లాడుతూ ''నీవేమీ బిడియపడుతూ భయపడనక్కర్లేదమ్మా. నీకు విశ్వరూపాచార్యులు ఎంతో నేనూ అంతే అనుకో'' అన్నాడు.

సావిత్రమ్మకి సంతోషం కలిగింది. ఈ సంబంధం ఖాయం అవుతుందని ఉక్కిరిబిక్కిరి అయింది. పెళ్లికొడుకు మల్లిబాబు వంక చూసింది. నల్లగా, ఎత్తుగా ఉన్నాడు. నలుపైనా ముక్కు మొహం ఆకర్షణగానే ఉన్నాయి.


''బావగారూ! ఏదో శాస్త్రప్రకారం ఈ పెళ్లిచూపులు కానీ, విశ్వరూపాచార్యులుగారు పిల్ల రూపురేఖలు, మీ మంచితనం, మీయొక్క ఆర్థిక స్థోమత అంతా చెప్పారు. మాకు పెద్ద ఆశలులేవు. మీ అమ్మాయి మా అమ్మాయిగా కలసిపోతే అదే మాకు ఆనందం'' అన్నాడు పార్వతీశం.

''అందులో మీకేమీ సందేహం అక్కర్లేదు. విశ్వరూపం చెప్పినట్లుకి ఎక్కువే ఉంటాయి ఈ నడవడికలు'' అన్నాడు నీలకంఠం.

పెళ్ళిచూపులు జరిగాయి. పార్వతీశానికి పిల్ల నచ్చింది. జగదీశ్వరివంక చూశాడు. ఆమె తృప్తిగా నవ్వింది.

''అమ్మా! అమ్మాయిని లోపలకు తీసుకువెళ్ళు'' అన్నాడు పార్వతీశం సావిత్రమ్మతో. ఆమె కామాక్షిని లోపలికి తీసుకువెళ్ళింది.

కాత్యాయనికి కొంచెం బాధగా వుంది. ఎన్నో ఆశలతో భర్త గురించి ఊహించుకుంటే ఆ వచ్చిన ఎవరైనా అంటారేమోనని తను గొప్పలు నటిస్తుంది. ఇప్పుడు చెల్లెలుకి వచ్చినవాళ్ళ మాటలనుబట్టి చూస్తే చాలా సహృదయతగల వాళ్ళు అని తెలుస్తుంది. ఒకవేళ ఈ పెళ్ళి జరిగితే, చెల్లెలి భర్త గుణవంతుడైతే అంతకంటే మానసిక బాధ ఉంటుందా? ఆలోచనా సాగరంలో మునిగిపోతూ పెళ్ళి వాళ్ళకు మంచి నీళ్ళు, ఫలహారాలు ఇచ్చింది.



కామాక్షికి ఏదో సింహాసనం లభిస్తుందన్న భావనతో దిగులుతో పరాగ్గా టీ ట్రేతో వస్తూ టేబులు తగిలి తూలింది. ట్రేలో వున్న కప్పులన్నీ జగదీశ్వరిపైపడి బట్టలు తడిసిపోయాయి.

జగదీశ్వరి చిరాకుపడి లేస్తూ ''ఛీ...ఛీ...ఇదేమిటమ్మాయ్? బంగారంలాంటి చీర పాడైపోయింది. చూసి నడవక్కర్లేదూ'' అంది.

''పొరపాటు జరిగిపోయింది లెండి'' అంది సావిత్రమ్మ.

''కొత్త చుట్టాలు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలండీ''

''రండి! బాత్రూంలో చీర శుభ్రం చేసుకుందురుగానీ'' సావిత్రమ్మ లోపలకు దారి తీసింది. జగదీశ్వరి అనుసరించింది.

కాత్యాయని జరిగిన పొరపాటుకి బాధపడలేదు సరికదా జగదీశ్వరి విసుక్కున్నందుకు ఆవేశం వచ్చింది. అది అదుపుతప్పి కామాక్షి దగ్గరకు వచ్చి బుసలు కొట్టింది.

''ఈ పెళ్ళివాళ్ళు వట్టి గతిమాలినవాళ్ళలా ఉన్నారే. కాస్త చీరపై టీ పడితే ఏదో కంచి, బెనారస్ చీర పాడైపోయినట్లు ఆవిడ బాధపడుతోంది. అది మామూలు నేత చీర. అటువంటి చీరలు మా ఇంటిలో పాతగుడ్డలకి కూడా పనికిరావు. మావారు ఏ చీరకొన్నా ఐదువందలకి తక్కువ వుండదు. నీవు ఈ పెళ్ళికొడుకునే చేసుకుంటే మాలాగా ఖర్చు పెట్టలేవు'' అంది.

''సరేలే! ఊరుకో. వాళ్ళు వింటారేమో?'' అంది కామాక్షి.

''వింటే విననీ. నాకేం భయం. అసలు ఆ పెళ్ళికొడుకు నల్లతుమ్మ మొద్దులా ఉన్నాడు. ఛీ...ఛీ...'' అంది అసహ్యంగా కాత్యాయని.

బాత్రూం నుంచి వస్తున్న జగదీశ్వరి కాత్యాయని వంక చురుగ్గా చూసింది. కాత్యాయనీ తీవ్రంగా చూసింది.

జగదీశ్వరి పార్వతీశం దగ్గరకు వచ్చి మెల్లగా చెప్పింది. మల్లిబాబుతో ఇద్దరూ చెప్పారు. మల్లిబాబు తల ఊపాడు.

పెళ్ళిచూపులకి వచ్చినవాళ్ళంతా బయటకు వెళ్ళి మంతనాలు ఆడారు. సావిత్రమ్మ, నీలకంఠం ఆతృతతో చూస్తున్నారు.

పార్వతీశం ఒక్కడే వచ్చాడు.

''బావగారూ! మనకి స్నేహమే మిగులుతుంది. బంధుత్వం కలవడంలేదు. మా అబ్బాయికి మీ అమ్మాయి నచ్చలేదుట. క్షమించండి'' అంటూ నమస్కారం చేసి వెళ్తుండగా సావిత్రమ్మ కొద్ది దిగులుతో-

''అమ్మాయివల్ల పొరపాటు జరిగింది. అందువల్ల...?'' నసిగింది.

''ఆ అమ్మాయి తత్వం అది. బాగా ఖరీదైన స్థితిపరురాలు. అల్లుడిని చూసేటప్పుడు పిల్లకు పెళ్ళి అయితే చాలు అనే ఉద్దేశ్యంతో చూడకండి. అందరి అభిప్రాయం తెలుసుకుని అందరికీ అన్నివిధాలా నచ్చితేనే అల్లుడిగా చేసుకోండి. లేకపోతే ఒక అమాయకుడిని భ్రష్టుడిని చేసినవారవుతారు'' అని వెళ్ళిపోయాడు.

సావిత్రమ్మ, నీలకంఠం నిశ్చేష్టులై చూస్తుండిపోయారు.

''పోతే పోనీయండి. దీని తాతలాంటి సంబంధం తెస్తాను'' అన్నాడు మదన్ గంభీరంగా.

''ఏ పనికిమాలినవాడినో చూసి కామాక్షికి చెయ్యాలి. అప్పుడే మన పెద్దరికం నిలబడుతుంది'' అని మనసులో అనుకున్నాడు.

''ఏమైనా అంటే కాత్యాయని బాధపడుతుంది. మదన్ అలుగుతాడు'' అనే భయంతో నోరు మెదపలేదు సావిత్రమ్మ, నీలకంఠం.

★★★

అంతా విన్న విశ్వరూపాచార్యులుగారు ''బంగారంలాంటి సంబంధం చేచేతులా పాడు చేసుకున్నారు. పెళ్ళంటే ఇద్దరికీ జత కలవడం కాదు. ఇరుపక్షాలవాళ్ళు అన్యోన్యంగా మీరూ; మేమూ అనే తేడా లేక మనము అనే ఐక్యత కొరకు ఏర్పరచింది. అప్పుడే వివాహం అయిన జంట ప్రేమైక్యం పొందుతారు. పెద్దల గొప్పలతో ఒకళ్ళని ఒకళ్ళు చులకన చేసుకుంటే అది పెళ్ళికాదు'' అంటూ నిట్టూర్చారు విశ్వరూపాచార్యులుగారు.

★